క్లుప్తంగా

ఎర్ర చందనం మొక్కల పంపిణీ



రైతులకు మొక్కలు పంపిణీ చేసిన దృశ్యం

మడకశిరరూరల్: మండల పరిధిలోని ఆర్డీటీ రీజినల్ కార్యాలయంలో బుధవారం మడకశిర, రొళ్ల మండలాలకు చెందిన 31 మంది రైతులకు 1,550 ఎర్రచందనం మొక్కలను ఆర్డీటీ ఉచితంగా అందించింది. ఆ సంస్థ ఆర్డీ మల్లికార్జున మొక్కలను రైతులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఎర్రచందనం మొక్కల పెంపకం ద్వారా రైతులకు అదనంగా ఆదాయం వస్తుందన్నారు. ఈ మొక్కలు పెంచుకోవడానికి కేంద్ర ప్రభుత్వం, అటవీశాఖ అధికారులు అనుమతి ఇచ్చారన్నారు. ఏటీఎల్ రఘురామ్, ఫీల్డ్ సూపర్ వైజర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అవయవ దానం



మంజునాథ్ (ఫైల్)

పెనుకొండ: పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీకి చెందిన బోయ మంజునాథ్ అనారోగ్యం కారణంగా బెంగళూరులోని బ్యాపిస్ట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం బ్రెయిన్‌డెడ్ అయ్యాడు. దీంతో కుటుంబ సభ్యులు మంజునాథ్ కిడ్నీ, లివర్, గుండె, ఊపిరితిత్తులను ఇతరులకు అందించేందుకు వీలుగా దానం చేశారు.

ముస్లింలపై దాడులను అరికట్టాలి



అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన తెలుపుతున్న నాయకులు

హిందూపురం టౌన్: ఎన్డీఏ పాలనలో దేశ వ్యాప్తంగా ముస్లింలపై జరుగుతున్న దాడులకు అడ్డుకట్ట వేయాలని సోషియల్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందించారు. సోషల్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ హసీబ్ మాట్లాడుతూ లోక్‌సభ ఫలితాల తర్వాత 8 హత్యలు, 6 దాడులు, చట్ట విరుద్ధంగా బుల్డోజర్‌తో మూడు ఇల్లు కూల్చివేశారన్నారు. కేంద్ర హోంమంత్రి స్పందించి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అబ్దుల్ హబీబ్, మౌలానా అమ్జాద్ తదితరులు పాల్గొన్నారు.

వాసవీమాతకు పూజలు

పెనుకొండ: పట్టణంలోని కన్యకా పరమేశ్వరీ ఆలయంలో వాసవీమాత మెహిందీ అలంకరణలో బుధవారం భక్తులకు దర్శనం ఇచ్చారు. గోరింటాకు ఆకులతో అమ్మవారిని అలంకరించిన అర్చకులు ఆషాడ పూజలు చేశారు. ఆర్యవైశ్యులు పెద్దఎత్తున అమ్మవారిని దర్శించుకున్నారు.

జాషువా సేవలు వెలకట్టలేనివి



జాషువా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

పెనుకొండ: ప్రముఖ కవి గుర్రం జాషువా తెలుగు సాహిత్యానికి చేసిన సేవలు వెలకట్టలేనివని ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు ఎంఎస్ మూర్తి పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం గుర్రం జాషువా 35వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ సుదర్శన్, అధ్యాపకులు మూర్తి, హఫీజ్, శంకర్‌నాయక్, శ్రీలేఖ, శివన్న, శంకరప్ప తదితరులు పాల్గొన్నారు.

హుండీ కానుకల లెక్కింపు

అమరాపురం: హేమావతిలో వెలసిన సిద్దేశ్వర స్వామి హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమాన్ని ఈఓ నరసింహరాజు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. హుండీ ద్వారా రూ.2.81,510, 11.4 మిల్లీ గ్రాముల బంగారం వచ్చినట్లు ఈఓ తెలిపారు.

యూటీఎఫ్ కమిటీ ఎంపిక



ఎంపికైన నూతన కమిటీ సభ్యులు

రొళ్ల: మండల కేంద్రంలోని జిల్లా ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం జిల్లా యూటీఎఫ్ గౌరవాధ్యక్షుడు భూతన్న ఆధ్వర్యంలో మండల యూటీఎఫ్ అడహక్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల యూటీఎఫ్ గౌరవాధ్యక్షుడిగా నారాయణస్వామి, అధ్యక్షుడిగా శ్రీకాంత్, ఉపాధ్యక్షుడిగా అనిల్‌కుమార్, మహిళా అధ్యక్షురాలిగా నాగరూప, ఉపాధ్యక్షురాలిగా వసంతలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా కేశవ్‌ప్రసాద్, కోశాధికారిగా పోతలయ్యతో పాటు కార్యదర్శులు, సభ్యులను ఎన్నుకున్నారు.

వణికిస్తున్న సీజనల్ వ్యాధులు

- ఆస్పత్రులకు క్యూ కడుతున్న జనం
- పారిశుధ్యంపై దృష్టిసారించని అధికారులు

పెనుకొండ రూరల్: వాతావరణ మార్పులతో సీజనల్ వ్యాధులు ప్రజలను వణికిస్తున్నాయి. దీంతో రోగులతో ప్రభుత్వాస్పత్రులతో పాటు ప్రైవేటు ఆస్పత్రులు కూడా కిటకిటలాడుతున్నాయి. కొందరు ఆర్‌ఎంపీలు ప్రథమ చికిత్స కేంద్రాన్ని వైద్యశాలగా మార్చేసి సొమ్ము చేసుకుంటున్నారు.

వర్షాకాలం ప్రభావం

సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా, టైఫాయిడ్, డయేరియా విజృంభిస్తున్నాయి. వర్షాకాలంలో లార్వా, బ్యాక్టీరియాతో వ్యాధులు సులభంగా వ్యాపిస్తున్నాయి. వ్యాధులు చిన్నవే అయినప్పటికీ వాటి ప్రభావం తీవ్రత దాటినప్పుడు ఊహించని ఫలితాలను చవి చూడాల్సి వస్తోంది.

లోపించిన పారిశుధ్యం

పెనుకొండ నియోజకవర్గంలో పారిశుధ్యం లోపించింది. ఆర్‌డబ్ల్యూఎస్ , పంచాయతీ, మున్సిపల్ అధికారుల సమన్వయ లోపం కారణంగా పారిశుధ్య పనులు మొక్కుబడిగా సాగుతున్నాయి. అధికారులు ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా వ్యవహరిస్తుండటంతో కిందిస్థాయి సిబ్బంది నామమాత్రంగా పనులు చేస్తూ చేతులు దులుపుకుంటున్నారు.



అమ్మవారిపల్లి వద్ద రహదారి పక్కనే ఉన్న చెత్త



అగళి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న మహిళ

పొంచి ఉన్న మలేరియా ముప్పు

మలేరియా జ్వరం... ఈ పేరు చెబితేనే గ్రామాల్లో చాలా మంది ప్రజలు వణికిపోతారు. నెలల తరబడి జ్వరం పీడిస్తూ ఉండటమే దీనికి ప్రధాన కారణం. ఇది సోకిందంటే ఒక పట్టాన తగ్గదు. కొన్ని సందర్భాల్లో మరణాలూ సంభవించవచ్చు. ఈ ఏడాది జిల్లాలో కేవలం ఒక్క కేసు మాత్రమే నమోదైంది. అయినా కూడా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. దోమ వలన వ్యాపించే వ్యాధుల్లో మలేరియా ఒకటి. అనాఫిలిస్ అనే దోమకాటు వలన మలేరియా ప్రబలుతుంది. చలి, వణుకుతో కూడిన విపరీతమైన జ్వరం, ఒళ్లు నొప్పులు, మూత్రం మందగించడం, లివర్, కడుపులో నొప్పి, జ్వరం మూడురోజులకోసారి రెండు రోజులకోసారి లేద రోజు మార్చి రోజు వస్తూ ఉండటం ఈ వ్యాధి లక్షణం.

నివారణ ఇలా..

మనం శుభ్రంగా ఉండటంతో పాటు పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచుకోవడం, పాతబడిన, నీళ్లు నిల్వ ఉంచేలా చేసే వస్తువలను పరిసరాల నుంచి తొలగించాలి. శరీరం మొత్తం కవర్ అయ్యేలా దుస్తులు ధరించాలి. ఇంట్లోకు దోమలు రాకుండా జాలీలను పెట్టించుకోవాలి. అలాగే దోమతెరలు వాడుతూ వ్యాధులకు చెక్ పెట్టొచ్చు.

నియోజకవర్గ వ్యాప్తంగా ప్రభుత్వాస్పత్రుల్లో ఓపీ వివరాలు

మండలం	మే	జూన్	జూలై 20 తేదీ వరకూ
పెనుకొండ	9,100	14,000	15,600
పెనుకొండ రూరల్	3,969	4,199	4,010
సోమందేపల్లి	3,180	3,250	2,100
రొద్దం	4,992	5032	5,000
పరిగి	1,460	2,887	1,872
గోరంట్ల	1,970	1,969	2,035

దోమకాటుతో జాగ్రత్త !

అగళి: వర్షాకాలం కావడంతో వాతావరణంలో మార్పులతో పాటు సీజనల్ వ్యాధులూ వస్తున్నాయి. వీధుల్లో ఉండే మురుగు నీరు కారణంగా దోమలు వృద్ధి చెంది సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయి. ఇళ్లలో సైతం తగిన జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చని వైద్యులు చెబుతున్నారు. అలాగే ఇంటి పరిసరాల పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు రాకుండా ఉంటాయని సూచిస్తున్నారు. వ్యాధులు బారిన పడితే కచ్చితంగా వైద్యుల సలహా తప్పనిసరిగా తీసుకోవాలంటున్నారు.

బ్లీచింగ్, స్ప్రే చేసేవారేరీ?

అగళి మండలంలోని గ్రామాల్లో సీజనల్ వ్యాధుల వ్యాపిస్తున్నా చాలా గ్రామాల్లో బ్లీచింగ్ పౌడర్, స్ప్రే చూడలేదని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ఆహారం, నీరు కలుషితం కాకుండా చూసుకోవాలి, మల,మూత్ర విసర్జన అనంతరం చేతులను శుభ్రంగా చేసుకోవాలి.
- ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి.
- చిన్న పిల్లలకు ఒంటి నిండా దుస్తులు కప్పేఉంచేలా చర్యలు తీసుకోవాలి.
- పండ్లు, కూరగయలను శుభ్రంగా కడిగిన తర్వాతనే తినాలి.
- ఇంటి పరిసరాల్లో పాత టైర్లు, డ్రమ్ములు,



కొబ్బరి చిప్పలు ఉంచకూడదు.
- పేడదిబ్బలు సమీపంలో లేకుండా చూసుకోవాలి.
- వేడి చేసి చల్లార్చిన నీటిని తీసుకోవాలి. రాత్రి పూట దోమ కాటుకు గురికాకుండా దోమ తెరలు వాడాలి.

జాగ్రత్తలతో వ్యాధులకు చెక్



మూడు లేదా అంతకంటే ఎక్కువ రోజులు, విడతల వారీగా జ్వరం వస్తే పరీక్షలు చేయించుకోవాలి. వచ్చిన రిపోర్టును బట్టీ మలేరియా అని నిర్ధారణ చేసుకోవాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. మురికి కాలువలు, మురికి గుంటలలో అబ్బేట్, వేస్ట్ ఆయిల్ చల్లడం వలన దోమలు వాటి లార్వాను నశింపజేయొచ్చు. తగిన జాగ్రత్తలతో సీజనల్ వ్యాధులకు చెక్‌పెట్టొచ్చు.

– నాగరాజునాయక్, వైద్యుడు, గుట్టూరు

సజావుగా మండల సర్వ సభ్య సమావేశం

గోరంట్ల: మండల కేంద్రంలోని ఎంపీడీఓ సమావేశ మందిరంలో ఎంపీపీ ప్రమీలమ్మ అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం సజావుగా జరిగింది. మండలంలో జరుగుతున్న అభివృద్ధిని ఆయాశాఖల అధికారులు తెలియజేశారు. వడిగేపల్లి, మలసముద్రం గ్రామ పంచాయతీల్లో తాగునీటి అవసరాల కోసం నూతన బోరుబావులను ఏర్పాటు చేశామని, అయితే విద్యుత్ సరఫరా లేకపోవడంతో తాగునీరు అందించలేకపోతున్నమని ఆయా గ్రామల సర్పంచులు తెలిపారు. విద్యుత్‌శాఖ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదని వాపోయారు. వెంటనే చర్యలు తీసుకుంటామని విద్యుత్‌శాఖ ఇంజినీర్ శ్రీనివాసులు తెలిపారు.

అధికారుల తీరుపై మండిపడ్డ జెడ్పీటీసీ

సర్వ సభ్య సమావేశ సమాచారాన్ని ప్రజా ప్రతినిధులకు చిత్తు కాగితం ద్వారా తెలపడం ఏంటని జెడ్పీటీసీ సభ్యుడు పాలేజయరాంనాయక్ అధికారులను నిలదీశారు. దీనికి ఎంపీడీఓ స్పందిస్తూ ఇక మీదట అలా జరగకుండా చర్యలు తీసుకొంటామని హామీ ఇచ్చారు. మొత్తం మీద మండల సర్వసభ్య సమావేశం సజావుగా సాగింది. కార్యక్రమంలో తహసీల్దార్ అక్బల్‌బాషా, వైస్ ఎంపీపీ రామలక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్

రికార్డులు పక్కాగా నిర్వహించాలి

- సబ్‌కలెక్టర్ అపూర్వ భరత్

అమరాపురం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహిస్తున్న రికార్డులు పక్కాగా ఉండాలని సబ్‌కలెక్టర్ అపూర్వ భరత్ అధికారులకు సూచించారు. బుధవారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు భద్రపరచిన గదులను పరిశీలించారు.

రొద్దం: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు భద్రపరిచే గదిని సబ్‌కలెక్టర్ అపూర్వ భరత్ తనిఖీ చేశారు. రికార్డుల గదికి సంబంధించి సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయా? అని పరిశీలించారు.

గుడిబండ: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని బుధవారం డిప్యూటీ కలెక్టర్ అపూర్వ భరత్ తనిఖీ చేశారు. రికార్డు గదిని తనిఖీ అనంతరం రెవిన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు చేశారు.



అమరాపురం: అధికారులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ అపూర్వ భరత్

మడకశిర: పట్టణంలో తహసీల్దార్ కార్యాలయంలోని రికార్డ్ రూములను పెనుకొండ సబ్‌కలెక్టర్ అపూర్వభరత్ పరిశీలించారు. తహసీల్దార్ వెంకటేష్, డిప్యూటీ తహసీల్దార్ బాలాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

శిక్షా సప్తాహ్‌ను విజయవంతం చేయండి

రొళ్ల: 'శిక్షా సప్తాహ్' కార్యక్రమాన్ని ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు విజయవంతం చేయాలని ఎంఈఓ శ్రీధర్ పేర్కొన్నారు. బుధవారం మధ్యాహ్నం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి పలు సూచనలు, సలహాలిచ్చారు.

ముగిసిన మొహర్రం

మడకశిరరూరల్: మండల పరిధిలోని దిగువ అచ్చంపల్లిలో మొహర్రం వేడుకలు ముగిశాయి. బుధవారం తెల్లవారుజామున అగ్ని గుండా మహోత్సవం నిర్వహించారు. సాయంత్రం భక్తిశ్రద్ధలతో పీర్ల స్వాములకు భక్తులు చెక్కర, శనగ పప్పులను చదింపులు చేయించారు. అనంతరం అగ్ని గుండం వద్ద ప్రత్యేక పూజలు, ప్రార్ధనలు చేశారు. తర్వాత ఊరేగింపుగా జలధికి తరలించారు.

కూటమి అరాచకంపై గళమెత్తిన వైఎస్సార్‌సీపీ



ధర్నాలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే శంకరనారాయణ , నాయకుడు కొండూరు వేణుగోపాల్‌రెడ్డి

హిందూపురం: రాష్ట్రంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేపట్టిన ధర్నాలో హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక పాల్గొన్నారు. ఆమెతో పాటు నియోజకవర్గ నాయకుడు వేణురెడ్డి, మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ప్లకార్డులతో నిరసన తెలిపారు. మరోవైపు మాజీ ఎమ్మెల్యేలు ఉషశ్రీచరణ్, శంకరనారాయణ కూడా ధర్నాకు హాజరయ్యారు.

నేమ్ బోర్డు ఏర్పాటు చేయండి

లేపాక్షి: పర్యాటక కేంద్రమైన లేపాక్షిని తెలిపే నేమ్ బోర్డును జాతీయ రహదారిలో రెండు చోట్ల ఏర్పాటు చేయాలని సీపీఐ నాయకులు తహసీల్దార్ బాలనరసింహులకు బుధవారం వినతిపత్రం అందజేశారు. పిల్లిగుండ్లు సమీపంలోని సర్కిల్, గలిబిపల్లి క్రాస్ సమీపంలో నేమ్ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు.

కంటి వైద్య శిబిరం

పావగడ: తాలూకాలోని తిరుమణి గ్రామంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో హెల్ప్ సొసైటీ, శంకర కంటి ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 34 మందిని శస్త్ర చికిత్సకు ఎంపిక చేసి వారిని బెంగళూరుకు తరలించారు.

విద్యా సామగ్రి పంపిణీ

లేపాక్షి: మండలంలోని తిలక్‌నగర్ ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు చేయూత ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆ ట్రస్ట్ అధ్యక్షులు గూడూరు రమేష్ రూ.15 వేలు విలువ చేసే విద్యాసామగ్రిని బుధవారం ఉదయం వితరణ చేశారు.

కూలీల సంఖ్య పెంచాలి

అమరాపురం: ఉపాధి పథకం కింద పనిచేసే కూలీల సంఖ్య పెంచాలని ఏపీడీ లక్ష్మీనారాయణ అధికారులకు సూచించారు. బుధవారం సాయంత్రం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ భాస్కర్ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం జరిగింది. కార్యక్రమంలో ఏపీఓ జగదీష్, టీఏలు, ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.

రాగి పంట సాగుపై అవగాహన

మడకశిరరూరల్: మండల పరిధిలోని గౌడనహళ్లి పంచాయతీలో రైతులు సాగు చేసిన వేరుశనగ, రాగి తదితర పంటలను బుధవారం ఏఓ తిమ్మప్ప పరిశీలించారు. జమ్మానిపల్లి సమీపంలో రైతులకు రాగి పంట సాగుపై అవగాహన కల్పించారు. ఆర్బీకే సిబ్బంది మారుతీ, రైతులు పాల్గొన్నారు.

డిప్లొమోల్లో చేరేందుకు దరఖాస్తుల ఆహ్వానం

లేపాక్షి: ఆంధ్ర-కర్ణాటక సరిహద్దులో కుడుములకుంటే పారిశ్రామికవాడలోని కర్ణాటక ప్రభుత్వ డిప్లొమో కళాశాలలో (గవర్నమెంట్ టూల్ రూం అండ్ ట్రెనింగ్ సెంటర్) ఏపీ విద్యార్థులకు సైతం అడ్మిషన్‌లకు అవకాశం ఉందని ప్రిన్సిపాల్ హరీష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. డిప్లొమో ఇన్ టూల్ అండ్ డైమేకింగ్, డిప్లొమో ఇన్ మెకట్రానిక్స్, డిప్లొమో ఇన్ ప్రిసిషన్ మ్యానుఫ్యాక్చరింగ్ కోర్సులు ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి అభ్యర్థులు ఈనెల 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్లు 7348342369, 9731684439 సంప్రదించాలని సూచించారు.

సంక్షిప్త సమాచారం

ప్రథమ చికిత్సా కేంద్రాల తనిఖీ

అగళి: మండల కేంద్రంలోని ప్రథమ చికిత్స కేంద్రాలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ శివనంద బుధవారం తనిఖీ చేశారు. ఆర్‌ఎంపీ డాక్టర్లకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. ఆర్‌ఎంపీ డాక్టర్లు కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేయాలన్నారు. అనంతరం మండల కేంద్రంలోని హోటళ్లు, మినీ ఫుడ్ సెంటర్లు తనిఖీ చేశారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

లేపాక్షి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ వెంకటరత్నమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వాసుదేవగుప్త తెలిపారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, మండలాధికారులు హాజరుకావాలని కోరారు.

సీఐటీయూ మండల కమిటీ ఎంపిక

చిలమత్తూరు: సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జేపీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో బుధవారం మండల నూతన కమిటీని ఏర్పాటు చేశారు. సీఐటీయూ మండల కన్వీనర్‌గా రామచంద్ర, కో కన్వీనర్‌గా వెంకటేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే 15 మంది సభ్యులను కూడా ఎన్నుకున్నారు.

కత్తెర పురుగు నివారణ చర్యలు

హిందూపురం అర్బన్: మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు తీవ్రత ఎక్కువగా ఉందని, తగిన నివారణ మందులు తక్షణం చేపట్టాలని వ్యవసాయ అధికారి సురేంద్రనాయక్ తెలిపారు. మండలంలోని మలగూరులో బుధవారం మొక్కజొన్న తోటను వ్యవసాయ అధికారులు పరిశీలించారు. కత్తెర పురుగు నివారణకు ఇమామెక్టిన్ బెంజోయేట్ 80 గ్రాములు, లేదంటే కోరాజిన్ 60 గ్రాముల నీటితో కలిపి ఒక ఎకరానికి మొక్క సుడుల్లో పడే విధంగా పిచికారీ చేయాలన్నారు.

దేశ సేవలో విద్యార్థుల పాత్ర కీలకం

పరిగి: దేశ సేవలో విద్యార్థుల పాత్ర కీలకమని ఏపీ ఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ కొడిగెనహళ్లి పాఠశాల ప్రిన్సిపాల్ మురళీధర్‌బాబు తెలిపారు. స్థానిక పాఠశాలలో బుధవారం ఎన్‌సీసీ క్యాడెట్ల ఎంపిక ప్రక్రియను ఆర్మీ అధికారి అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్‌సీసీ అంటే సమాజంలో ఉన్న అన్ని వర్గాల ప్రజలకు సామాజిక న్యాయం చేయడమేనన్నారు. అనంతరం 51 మందిని ఎంపిక చేసినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

కొండూరులో క్రీడా పోటీలు

లేపాక్షి: మండలంలోని కొండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఉదయం విద్యార్థులకు క్రీడా పోటీలను నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయుడు శేషగిరిబాబు తెలిపారు. ప్రాచీన ఆటలైన తొక్కుడు బిళ్ల, స్కిప్పింగ్, కుంటే ఆటతో పాటు క్రికెట్, షటిల్ తదితర ఆటలను ఆడించామన్నారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం చేసినట్లు పేర్కొన్నారు.

అనుమతి లేని పాఠశాల సీజ్

పావగడ: విద్యాశాఖ నుంచి ఎలాంటి అనుమతి లేకుండా పట్టణంలో నిర్వహిస్తున్న పరి ఏంజిల్స్ ప్రీ ప్రైమరీ స్కూల్‌ను బీఈఓ ఇంద్రాణమ్మ ఆధ్వర్యంలో సీజ్ చేశారు. బుధవారం ఆమె పాఠశాలను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. 72 మంది విద్యార్థులు విద్యా సంవత్సరం కోల్పోకుండా ఇతర పాఠశాలలకు బదిలీ చేస్తామన్నారు.

ఘనంగా జ్యోతుల ఉత్సవం



జ్యోతులను ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు



అలంకరణలో కొల్లాపురమ్మ

మడకశిరరూరల్: మండల పరిధిలోని సీ కొడిగేపల్లిలో వెలసిన కొల్లాపురమ్మ ఆలయ ఐదో వార్షికోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం మహిళలు జ్యోతుల ఉత్సవాన్ని నిర్వహించారు. అమ్మవారికి జ్యోతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఎస్‌హెచ్‌ఓకు సన్మానం

అమరాపురం: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌హెచ్‌ఓగా విధులు నిర్వర్తిస్తూ బదిలీపై హిందూపురంకు వెళ్తున్న నరసింహులు సేవలు మరువలేనివని ఎస్ఐ జనార్ధననాయుడు, ఏఎస్ఐ రామంజనేయులు తెలిపారు. బుధవారం రాత్రి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నరసింహులుకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు.

ఆలయానికి విరాళం



విరాళం అందిస్తున్న దృశ్యం

హిందూపురం: పట్టణంలోని గాంధీ సర్కిల్ ఎదురుగా కాయగూరల మార్కెట్‌వద్ద తలపెట్టిన లక్ష్మీనరసింహస్వామి ఆలయ నిర్మాణానికి మార్కెట్ హోల్‌సెల్ వ్యాపారస్తుడు బీఎస్ఎన్ సూర్యనారాయణ కుమారుడు భరత్ రూ.2,22,222 విరాళాన్ని అందించారు. ఆలయ ట్రస్టీలుగా తనవంతు విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందించారు.

మహా గణపతికి పూజలు

హిందూతపురం: సంకష్టహర చతుర్థిని పురస్కరించుకుని బుధవారం రాత్రి వినాయక ఆలయాల్లో ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని శ్రీనివాసనగర్, బెంగళూరు రోడ్డులోని గణపతి ఆలయాలకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి ఉపవాస దీక్షలు చేశారు. రాత్రి విశేష పూజల తర్వాత దీక్షలను విరమించారు.

మహిళలపై దాడులకు వ్యతిరేకంగా నిరసన



మాట్లాడుతున్న ఏఐఎంఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షురాలు హేమవతి

హిందూపురం టౌన్: పసిపిల్లలు, మహిళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలకు వ్యతిరేకంగా పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఏఐడీఎస్ఓ, ఏఐఎంఎస్ఎస్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక పొట్టిశ్రీరాములు సర్కిల్‌లో మానవహారం నిర్వహించారు. ఆలిండియా డెమొక్రటిక్ స్టూడెంట్ ఆర్గనైజేషన్ రాష్ట్ర కార్యదర్శి మహేష్, ఏఐఎంఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షురాలు హేమావతి మద్యం, మత్తు పదార్థాలు, అశ్లీల సినిమా సాహిత్యాలతో లైంగిక దాడులు పెరిగిపోతున్నాయని, వాటిని నిషేధించాలని అన్నారు.

అత్యాచారాలను అరికట్టాలి

హిందూపురం: పసిబాలికలు, మహిళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలకు వ్యతిరేకంగా ఆల్ ఇండియా డెమొక్రటిక్ స్టూడెంట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బుధవారం పొట్టిశ్రీరాములు సర్కిల్ వద్ద మానవహారం నిలిచి నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఏఐఎంఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు హేమావతి, కార్యదర్శి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దండి



మాట్లాడుతున్న రాజేంద్రసింగ్ సంగ్వాన్

పెనుకొండ: విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని న్యాక్ టీం సభ్యులు తెలిపారు. పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం న్యాక్ టీం బృందం అధ్యాపకులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు, సలహాలిచ్చారు. ఈ సందర్భంగా టీం సభ్యులు మాట్లాడుతూ మారుమూల గ్రామాల నుంచి కళాశాలకు వచ్చి చదువుకునే పేద విద్యార్థులకు నాణ్యతతో కూడిన విద్యను బోధించి వారి ఉన్నత స్థితికి పాటుపడాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కేశవరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో న్యాక్ టీం చైర్మన్ రాజేంద్రసింగ్ సంగ్వాన్, కోఆర్డినేటర్ ప్రొఫెసర్ బ్రిజబల్లపాల్, సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాలలో హెల్త్ క్యాంప్

గుడిబండ: మడకశిరలో ఉన్న గుడిబండ మండలానికి చెందిన ఎంజేపీ బాలికల పాఠశాలలో బుధవారం వైద్య సిబ్బంది డయేరియాపై హెల్త్ క్యాంప్ నిర్వహించారు. 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకూ చదువుతున్న విద్యార్థినీలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
హిందూపురం డివిజన్
9912220717, 9912220723, 9705346587
9010200238, 9912220726